## టెట్ దరఖాస్తుల స్వీకరణ ఆలస్యం

- సాంకేతిక కారణాలతో ఓపెన్ కాని వెబ్‌సైట్

హైదరాబాద్, నవంబర్ 5 (నమస్తే తెలంగాణ): ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) షెడ్యూల్‌ను సోమవారం విడుదల చేసింది. మంగవారం సమగ్ర నోటిఫికేషన్‌ను విడుదల చేస్తామని, వెంటనే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని విద్యాశాఖ ప్రకటించింది. దీంతో అభ్యర్థులంతా మంగళవారం ఉదయం నుంచే దరఖాస్తు చేసేందుకు ప్రయత్నించారు. టెట్ వెబ్‌సైట్‌ను ఓపెన్ చేస్తే అప్లికేషన్ విండో ప్రత్యక్ష్యం కాలేదు. డీటెయిల్డ్ నోటిఫికేషన్‌ను విడుదల చేయలేదు. దీంతో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ఆఖరుకు ఈ నెల 7న ఇన్ఫర్మేషన్ బులిటిన్, నోటిఫికేషన్‌ను విడుదల చేస్తామని, అభ్యర్థులు ఆ రోజు నుంచే దరఖాస్తు చేసుకోవచ్చని ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ రమేశ్ తెలిపారు.

## ఇంటర్ పరీక్ష ఫీజు పెంపు

- నేటినుంచి 26వరకు స్వీకరణ
- ఆలస్య రుసుముతో డిసెంబర్ 27 వరకు

హైదరాబాద్, నవంబర్ 5 (నమస్తే తెలంగాణ): నిరుటితో పోల్చితే ఇంటర్ వార్షిక పరీక్షల ఫీజులు స్వల్పంగా పెరిగాయి. ఫస్టియర్ పరీక్ష ఫీజు నిరుడు రూ.510 ఉంటే.. ఈసారి రూ.520కి పెరిగింది. రూ.730 ఉన్న సెకండియర్ ఫీజును రూ.750కి పెరిగింది. ఇంటర్ పరీక్ష ఫీజును చెల్లించేందుకు ఈ నెల 6 నుంచి 26 వరకు గడువు ఇచ్చారు. రూ.100 ఆలస్య రుసుముతో డిసెంబర్ 4 వరకు, రూ.500 ఆలస్య రుసుముతో డిసెంబర్ 11 వరకు, రూ. వెయ్యి ఆలస్య రుసుముతో డిసెంబర్ 18 వరకు, రూ. రెండు వేల ఆలస్య రుసుముతో డిసెంబర్ 27 వరకు ఫీజు చెల్లించేందుకు అవకాశమిచ్చారు.

## టీచర్లకు తొలివేతనం అందేదెప్పుడు?

హైదరాబాద్, నవంబర్ 5 (నమస్తే తెలంగాణ): ఇటీవల ఉద్యోగాల్లో చేరిన 10 వేల మందికిపైగా కొత్త టీచర్లకు వచ్చే నెలలోనూ తొలి వేతనం అందడం అనుమానంగానే ఉంది. వీరికి ఇంతవరకూ ఎంప్లాయ్ ఐడీలు ఇవ్వలేదు. 33 జిల్లాల్లో కేవలం రెండుమూడు జిల్లాలోనే కేటాయించారు. ఐడీలు వచ్చిన వారికి కూడా ప్రాన్ నంబర్లూ జనరేట్ కాలేదు. ఈ రెండు ఉంటేనే వేతనాల బిల్లులు చేస్తామని అధికారులు చెప్తున్నారు. మరోవైపు కొత్త టీచర్ల డేట్ ఆఫ్ జాయినింగ్ అక్టోబర్ 10, 16 అని విద్యాశాఖ అధికారులు స్పష్టత ఇచ్చినా, రాష్ట్ర ఆర్థిక విభాగం నుంచి తమకు సమాచారం అందలేదని అధికారులు చెబుతున్నారు. ఎంప్లాయ్ ఐడీలను ఒక తేదీన.. శాలరీ లెక్కింపు చేసేది మరో తేదీ ఉండటంతో గందరగోళం నెలకొన్నది.

## ఒక డీఏతో నిరాశకు లోనయ్యాం: లక్ష్మయ్య

హైదరాబాద్, నవంబర్ 5 (నమస్తే తెలంగాణ) : డీఏల కోసం ఆశగా వేచి చూసిన తాము ప్రభుత్వం ఒకే ఒక్క డీఏను ప్రకటించడంతో తీవ్ర నిరాశకు గురయ్యామని పెన్షనర్స్ జేఏసీ ప్రకటించింది. జేఏసీ సమావేశాన్ని మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ కే లక్ష్మయ్య, సెక్రటరీ జనరల్ శుభాకర్ రావు మాట్లాడుతూ నాలుగు డీఏలను విడుదల చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను, మెడికల్ బిల్లులను మంజూరుచేయాలని కోరారు.

## మూడుసార్లు జేఈఈ అడ్వాన్స్‌డ్

హైదరాబాద్, నవంబర్ 5 (నమస్తే తెలంగాణ): ఇక నుంచి జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలను వరుసగా మూడేండ్లు రాసుకోవచ్చు. నంబర్ ఆఫ్ అటెంప్ట్స్‌ను రెండు నుంచి మూడుకు పెంచారు. 2025లో నిర్వహించే అడ్వాన్స్‌డ్ పరీక్షతో ఈ నిబంధన అమల్లోకి వస్తుంది. ఇది వరకు ఒక విద్యార్థి వరుసగా రెండేండ్లు మాత్రమే జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు హాజరయ్యే వీలుండేది. ఇప్పుడు పరీక్షను మూడు సార్లు రాసుకునే అవకాశమిచ్చారు. జేఈఈ-2025 నిర్వహణ బాధ్యతలను ఐఐటీ కాన్పూర్‌కు అప్పగించారు.

## ఇంజినీరింగ్ కాలేజీల గుర్తింపు ప్రారంభం

హైదరాబాద్, నవంబర్ 5 (నమస్తే తెలంగాణ): కొత్త ఇంజినీరింగ్ కాలేజీలు నెలకొల్పడం, ఇప్పటికే నడుస్తున్న కాలేజీలకు అనుబంధ గుర్తింపు పొడిగింపును అఖిల భారత సాంకేతిక విద్యామండలి(ఏఐసీటీఈ) ప్రారంభించింది. తెలంగాణలోని కాలేజీలు 25 నుంచి డిసెంబర్ 9 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆలస్యరుసుంతో జనవరి 18 నుంచి ఫిబ్రవరి 2 వరకు అవకాశమిచ్చారు. ఏఐసీటీఈ రాష్ట్రాలు, కాలేజీలను ఈ ఏడాది నాలుగు గ్రూపులుగా విభజించగా.. తెలంగాణ గ్రూప్-2లో ఉంది.

# నాడు జన్మనిచ్చి.. నేడు పునర్జన్మ

**కాలేయదానంతో కుమార్తెను కాపాడుకున్న అమ్మ ● ఆర్థిక భరోసా ఇస్తున్న బంధువులు, ఆప్తులు**

టేకుమట్ల, నవంబర్ 5: నవ మాసాలు మోసి నాడు బిడ్డకు జన్మనిచ్చిన ఓ మాతృమూర్తి.. నేడు తన కాలేయం నుంచి కొంత దానం చేసి పునర్జన్మనిచ్చింది. బిడ్డ కోసం తల్లి తన ప్రాణాలను సైతం లెక్కచేయదనే నానుడిని నిజం చేసింది. ఈ ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం రాఘవాపూర్‌లో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన దండ్రే రమేశ్-కవిత దంపతుల కూతురు మహాలక్ష్మి(13) జూలై నుంచి కాలేయ వ్యాధితో బాధపడుతున్నది. హైదరాబాద్‌లోని ఓ దవాఖానలో చూపించగా మహాలక్ష్మి కాలేయం దెబ్బతిన్నదని, లివర్ ట్రాన్స్‌ప్లాంట్ చేయాలని వైద్యులు సూచించారు. తల్లడిల్లిపోయిన ఆ తల్లి.. బిడ్డ ప్రాణాలను కాపాడేందుకు తన కాలేయాన్ని ఇవ్వడానికి సిద్ధపడింది. దెబ్బతిన్న పాప కాలేయాన్ని తొలగించిన వైద్యులు.. ఈ నెల 2న 12 గంటల పాటు ఆపరేషన్ చేసి తల్లి కాలేయంలోని కొంత భాగాన్ని పాపకు ట్రాన్స్‌ప్లాంట్ చేశారు. ప్రస్తుతం తల్లి కోలుకుంటున్నదని, పాప మరో రెండు రోజుల్లో కోలుకుంటుందని, ఇంకా 20 రోజులు దవాఖానలోనే ఉండాలని, వైద్యులు చెప్పినట్టు పాప బంధువులు తెలిపారు. పాప సమస్యను, తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితిని చూసి చలించిన బంధుమిత్రులు, వ్యాపారులు, నాయకులు, యువకులు, ఉద్యోగులు, ప్రజలు తమకు తోచిన సహాయం చేస్తున్నారు. ఇతరులతో సోషల్ మీడియా ద్వారా ఆర్థిక సహాయం చేయిస్తూ ఆ కుటుంబానికి ఆర్థికంగా, మానసికంగా అండగా నిలుస్తున్నారు. పెద్దమొత్తంలో ఖర్చులు అవుతున్నాయని, ప్రభుత్వపరంగా ఆదుకోవాలని, దాతలు 9701329434 నంబర్‌కు ఆర్థిక సహాయం చేయాలని బాలిక తండ్రి దండ్రే రమేశ్ వేడుకుంటున్నాడు.

# బీఆర్ఎస్ నేత ఫంక్షన్‌హాల్ నేలమట్టం

- రామగుండంలో నాలాపై నిర్మించారని నెల కింద నోటీసులు
- తాజాగా బందోబస్తు మధ్య రెండు జేసీబీలతో కూల్చివేత

రామగుండంలోని అడ్డగుంటపల్లిలో బీఆర్ఎస్ నేతకు చెందిన సిరి ఫంక్షన్‌హాల్‌ను కూల్చివేస్తున్న మున్సిపల్ సిబ్బంది

కోల్‌సిటీ, నవంబర్ 5: పెద్దపల్లి జిల్లా రామగుండం నగరంలో ఆపరేషన్ కూల్చివేతల పర్వం కొనసాగుతున్నది. నిన్నటికి నిన్న గోదావరిఖని ప్రధాన చౌరస్తాలోని బీఆర్ఎస్ కార్యాలయాన్ని కూల్చివేసిన పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు.. తాజాగా మంగళవారం ఉదయాన్నే అడ్డగుంటపల్లిలోని బీఆర్ఎస్ 37వ డివిజన్ కార్పొరేటర్ పెంట రాజేశ్‌కు చెందిన సిరి ఫంక్షన్‌హాల్‌ను కూల్చారు. ఫంక్షన్‌హాల్‌ను నాలాపై నిర్మించారని, అనుమతులు లేని కారణంగా నెల రోజుల కింద నోటీసులు జారీ చేశామని, ఫంక్షన్‌హాల్ యజమాని స్పందించకపోవడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు కూల్చివేశామని అదనపు కలెక్టర్, నగర కమిషనర్ జే అరుణశ్రీ తెలిపారు. కూల్చివేతల విషయం తెలుసుకొన్న రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, బీఆర్ఎస్ కార్పొరేటర్లు, కార్యకర్తలు వెంటనే అడ్డగుంటపల్లికి చేరుకొని.. కొంత సమయం ఇవ్వాలని, లేదంటే జరిమానా విధిస్తే చెల్లిస్తారని చెప్పినా అధికారులు వినిపించుకోలేదు. పెంట రాజేశ్ కుటుంబ సభ్యులు జేసీబీ ముందు నేలపై పడుకొని అడ్డుకున్నా.. మహిళా హోంగార్డుల సాయంతో వారిని అదుపులోకి తీసుకొని ఫంక్షన్‌హాల్‌ను నేలమట్టం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ మాట్లాడుతూ.. ఇది ముమ్మాటికీ కక్ష సాధింపు చర్యగా పేర్కొన్నారు. పెంట రాజేశ్‌కు చెందిన ఫంక్షన్‌హాల్‌కు అన్ని అనుమతులున్నప్పటికీ ఇంత హడావుడిగా కూల్చాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. కొంత సమయం ఇవ్వాలని కోరినప్పటికీ బలవంతంగా కూల్చేశారని విమర్శించారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీకి సహకరించాలని, ఎన్నికల తర్వాత కాంగ్రెస్‌లో చేరాలని ఒత్తిడి చేయగా.. తాను ఒప్పుకోలేదని, అందుకే తనపై కక్ష గట్టి ఫంక్షన్‌హాల్‌ను కూల్చేశారని యజమాని పెంట రాజేశ్ వివరించారు.

## గ్రూప్-1పై రేవంత్‌వి అబద్ధపు లెక్కలు

- పారదర్శకత ఉంటే అశోక్‌నగర్‌లో బహిరంగ చర్చకు సిద్ధమా?
- బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్

హైదరాబాద్, నవంబర్ 5 (నమస్తే తెలంగాణ): గ్రూప్-1 పరీక్షలో జీవో 29 ద్వారా ఎక్కువ శాతం బీసీలకు అవకాశం వచ్చినట్టు సీఎం రేవంత్‌రెడ్డి అబద్ధపు లెక్కలు చెప్తున్నారని బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. మీ లెక్కల్లో నిజాయితీ ఉందని నమ్మితే అశోక్‌నగర్‌లో గానీ, సెంట్రల్ లైబ్రరీలో గానీ, అమరవీరుల స్థూపం వద్దగానీ బహిరంగ చర్చకు సిద్ధమా? అని మంగళవారం ఎక్స్ వేదికగా సవాల్ విసిరారు. నిరుద్యోగులకు చేస్తున్న పచ్చి మోసం, దగాకు ప్రతీక సీఎం చెప్పిన అబద్ధపు లెక్కలని మండిపడ్డారు.

## 'మహారాష్ట్ర' కోసమే గన్నీ బ్యాగుల టెండర్లు

**సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ రవీందర్‌సింగ్**

కరీంనగర్ కార్పొరేషన్, నవంబర్ 5: మహారాష్ట్ర ఎన్నికలకు డబ్బులను పంపేందుకే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిబంధనలను మార్చి గన్నీ బ్యాగుల టెండర్లను నిర్వహించిందని సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్ ఆరోపించారు. మంగళవారం కరీంనగర్‌లో మాట్లాడారు. గన్నీ బ్యాగులను తీసుకునేందుకు టెండర్లు పిలిచారని తెలిపారు. తమ హయాంలో ఒక్క బ్యాగుకు రూ.14 నుంచి రూ.16లోపు వెచ్చించి తీసుకున్నామని, ప్రభుత్వం నిబంధనలు మార్చి రూ.20 నుంచి రూ.30 వెచ్చించి బ్యాగులను తీసుకునే ప్రయత్నాలు చేస్తున్నదని విమర్శించారు.

హైటెన్షన్ వైర్ల మధ్య చిక్కుకొని మంటల్లో కాలిపోతున్న డ్రోన్

## మాస్టర్ ప్లాన్ సర్వేలో అపశ్రుతి

**హైటెన్షన్ వైర్లకు తగిలి కాలి బూడిదైన డ్రోన్**

తాండూరు, నవంబర్ 5: వికారాబాద్ జిల్లా తాండూరు రూపురేఖలు మార్చే అమృత్ 2.0లో భాగంగా డీటీసీపీ, సర్వే ఆఫ్ ఇండియా నిర్వహిస్తున్న మాస్టర్ ప్లాన్ సర్వేలో మంగళవారం అపశ్రుతి చోటుచేసుకున్నది. ఈ నెల 1న డ్రోన్ ద్వారా ఈ సర్వే ప్రారంభించారు. సర్వేలో భాగంగా హైదరాబాద్ రోడ్డు మార్గం బషీర్‌మియా తండా సమీపంలో డ్రోన్ పైకి ఎగిరిన కొద్దిసేపటికే సాంకేతిక సమస్య కారణంగా క్రిందకు వచ్చే క్రమంలో హైటెన్షన్ వైర్లకు తగిలి నిప్పంటుకుంది. ఆ డ్రోన్ వరి పొలాల మధ్య పడిపోవడంతో పంటకు కూడా మంటలంటుకున్నాయి. స్థానికులు అప్రమత్తమై మంటలను ఆర్పివేశారు. మరో డ్రోన్ ద్వారా సర్వే పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. ప్రమాద ఘటన వివరాలు తెలిపేందుకు నిరాకరించారు.

- హెలికాప్టర్‌తో రీజినల్ రింగ్ రైల్ లైడార్ సర్వే

రీజినల్ రింగ్ రైల్ లైడార్ సర్వేకు కోసం ప్రత్యేక హెలికాప్టర్ మంగళవారం కొడంగల్‌కు చేరుకుంది. రీజినల్ రింగ్ రోడ్డుకు సమాంతరంగా నిర్మించే 'రింగ్ రైల్' లైడార్ సర్వేకు కొడంగల్ వేదికైంది. మూడు రోజులపాటు ఈ సర్వే నిర్వహించనున్నట్టు ఆర్‌పీ అసోసియేట్స్ ఏజెన్సీ ప్రతినిధులు తెలిపారు. సుమారు 564 కిలోమీర్ల పరిధిలో ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకోనుందని చెప్పారు. వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, గజ్వేల్, భువనగిరి, యాదాద్రి, చిట్యాల, నారాయణపూర్, షాద్‌నగర్, షాబాద్‌ను కలుపుతూ ఈ ప్రాజెక్టు ఉంటుందని పేర్కొన్నారు. – కొడంగల్

## ఏసీబీకి చిక్కిన పంచాయతీ కార్యదర్శి

కార్యదర్శి పుల్లయ్య

లక్ష్మీదేవిపల్లి, నవంబర్ 5 : విద్యుత్తు మీటర్ ఎన్‌వోసీ కోసం రూ.20 వేలు డిమాండ్ చేసిన పంచాయతీ కార్యదర్శిని ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలంలో మంగళవారం చోటుచేసుకున్నది. ఏసీబీ డీఎస్పీ రమేశ్ కథనం ప్రకారం.. రేగళ్ల పెద్దతండాకు చెందిన భూక్యా లక్ష్మా విద్యుత్తు మీటర్ కోసం ఎన్‌వోసీ కావాలని రేగళ్ల పంచాయతీ కార్యదర్శి కాంపాటి పుల్లయ్యకు దరఖాస్తు చేసుకున్నాడు. ఇందుకోసం కార్యదర్శి రూ.20 వేలు డిమాండ్ చేశాడు. సదరు బాధితుడు అంత డబ్బు ఇవ్వలేనని చెప్పి అనంతరం ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారు సూచన మేరకు బాధితుడు లక్ష్మా.. పంచాయతీ కార్యదర్శిని కలువగా అప్పుడు కూడా డబ్బులు డిమాండ్ చేయగా.. అక్కడే మాటువేసిన ఏసీబీ అధికారులు అతడిని పట్టుకున్నారు. కేసు నమోదు చేసి కార్యదర్శి పుల్లయ్యను అదుపులోకి తీసుకున్నట్టు ఏసీబీ డీఎస్పీ రమేశ్ తెలిపారు.

# బిర్యానీ తిన్న యువతి మృతి

- మరో నలుగురికి సీరియస్
- కామారెడ్డి దవాఖానకు తరలింపు
- గ్రిల్ నైన్ రెస్టారెంట్‌పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు
- కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు

చికిత్స పొందుతున్న బాధితులు

బోధ్, నవంబర్ 5: నిర్మల్‌లోని ఏఎన్‌రెడ్డి కాలనీలో గల గ్రిల్ నైన్ మల్టీ కుజైన్ రెస్టారెంట్‌లో బిర్యానీ తిని అస్వస్థతకు గురైన యువతి ఫూల్ ఖలీ బైగా(19) మంగళవారం మృతి చెందింది. ఆదిలాబాద్ జిల్లా బోధ్ మండలం పొచ్చెర క్రాస్ రోడ్డులో గల సెయింట్ థామస్ స్కూల్‌లో పనిచేస్తున్న ప్రిన్సిపాల్ సిస్టర్ స్మిత, ఫాదర్ దీపక్, వైఎస్ ప్రిన్సిపాల్ సోఫీ, ఉపాధ్యాయురాలు సిజి, వంట మనిషి ఫూల్ ఖలీ బైగాలు ఈ నెల 2న నిర్మల్‌లోని గ్రిల్ నైన్ మల్టీ కుజైన్ రెస్టారెంట్‌లో చికెన్-65, తందూరి చికెన్, చికెన్ ఫ్రైడ్ రైస్ తిన్నారు. ఫుడ్ పాయిజన్‌తో అస్వస్థతకు గురయ్యారు. ఈ నెల 3న పాఠశాల యాజమాన్యం బోధ్‌లోని సీహెచ్‌సీలో చేర్పించింది. వాంతులు, విరేచనాలు కావడంతో చికిత్స అనంతరం వారిని ఇంటికి తీసుకెళ్లారు. మళ్లీ తీవ్ర అస్వస్థతకు గురికావడంతో ఈ నెల 5న మరోసారి సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ ఫూల్ ఖలీ బైగా మంగళవారం మృతి చెందింది. మరో నలుగురి పరిస్థితి విషమంగా ఉండటంతో కామారెడ్డికి తరలించారు. గ్రిల్ నైన్ మల్టీ కుజైన్ రెస్టారెంట్‌పై పాఠశాల యాజమాన్యం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

## ఆహార నాణ్యతతోపాటు పరిశుభ్రతా ముఖ్యమే

**నిబంధనలు పాటించకుంటే చర్యలు: మంత్రి దామోదర**

హైదరాబాద్, నవంబర్ 5(నమస్తే తెలంగాణ): వీధివ్యాపారుల నుంచి కార్పొరేట్ హోటళ్ల వరకు ప్రతి ఒక్కరూ నాణ్యతతోపాటు పరిశుభ్రత కూడా పాటించాలని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ స్పష్టంచేశారు. హైదరాబాద్ వెంగళ్‌రావునగర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్‌లో ఫుడ్ సేఫ్టీ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో మంత్రి పాల్గొన్నారు. వీధివ్యాపారులకు ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఫుడ్ సేఫ్టీ విషయంలో నిబంధనలు పాటించేవారికి అండగా ఉంటామని, తప్పుచేస్తే ఎవ్వరినీ వదిలిపెట్టబోమని హెచ్చరించారు. ఫుడ్ సేఫ్టీ ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కారం కోసం కలెక్టరేట్లలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. నాచారంలోని ఫుడ్ సేఫ్టీ ల్యాబ్‌ను ఆధునీకరిస్తున్నామని, వరంగల్, నిజామాబాద్, మహబూబ్‌నగర్‌లో కొత్త ల్యాబ్స్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. నెల రోజుల్లో 3,774 హోటల్స్, స్ట్రీట్ ఫుడ్ వెండర్స్‌కు లైసెన్సులు ఇచ్చినట్టు ఫుడ్‌సేఫ్టీ అధికారులు తెలిపారు. ఫుడ్ సేఫ్టీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, డైరెక్టర్ శివలీల పాల్గొన్నారు.

## రాష్ట్రవ్యాప్తంగా పెరుగుతున్న చలి తీవ్రత

హైదరాబాద్, నవంబర్ 5 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు క్రమంగా పడిపోతున్నాయి. మంగళవారం పటాన్‌చెరులో అత్యల్పంగా 16.2 డిగ్రీల రాత్రి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. 2024 జనవరి సీజన్‌లో నగరంలో 8 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కాగా, ఈ సారి మరింత తక్కువ నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

## సీసీఎల్ఏ అసిస్టెంట్ సెక్రటరీగా లచ్చిరెడ్డి

హైదరాబాద్, నవంబర్ 5(నమస్తే తెలంగాణ): డిప్యూటీ కలెక్టర్, ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డికి ప్రభుత్వం పోస్టింగ్ ఇచ్చింది. ఆయన్ను సీసీఎల్ఏ అసిస్టెంట్ సెక్రటరీగా నియమిస్తూ రెవెన్యూశాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిట్టల్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

## 12 కోట్ల విలువైన డ్రగ్స్ దహనం

- ఒక్క నెలలో 7,951 కిలోల గంజాయి నిర్వీర్యం
- హైదరాబాద్, భద్రాద్రి జిల్లాల్లో అత్యధికంగా రవాణా
- ఎక్సైజ్ ఈడీ కమలాసన్‌రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 5 (నమస్తే తెలంగాణ): అక్టోబర్‌లో రూ.11.61 కోట్ల విలువైన గంజాయి, ఇతర డ్రగ్స్‌ను దహనం చేసినట్టు ఎక్సైజ్‌శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గత నెలలో ఆంధ్రా ఒడిశా బార్డర్ నుంచి గంజాయి.. బెంగళూర్, గోవా, విదేశాల నుంచి దిగుమతి అవుతున్న డ్రగ్స్‌ను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు పట్టుకున్నట్టు చెప్పారు. 703 కేసుల్లో పట్టుబడిన 7,951 కిలోల గంజాయి, డ్రగ్స్‌ను ఆయా జిల్లా కేంద్రాల్లో దహనం చేసినట్టు చెప్పారు. వీటి విలువ రూ.11,61,90,294 ఉంటుందని వెల్లడించారు. వీటితోపాటుగా ఆయా జిల్లాల్లో నిల్వ చేసిన రూ.75 కోట్ల విలువైన గంజాయి, డ్రగ్స్‌ను దహనం చేయనున్నట్టు తెలిపారు.

## 'గ్రాడ్యుయేట్స్' నమోదుకు గడువు పొడిగించండి

- సీఈవోకు విజ్ఞప్తి చేసిన పురుషోత్తం చాట్లపల్లి
- నేటితో ముగియనున్న గడువు

హైదరాబాద్, నవంబర్ 5(నమస్తే తెలంగాణ): గ్రాడ్యుయేట్ ఓటర్ నమోదుకు గడువు పొడిగించాలని పురుషోత్తం చాట్లపల్లి కోరారు. మంగళవారం సీఈవో సుదర్శన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. దీంతో సీఈవో సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు. కరీంనగర్-ఆదిలాబాద్-నిజామాబాద్-మెదక్ గ్రాడ్యుయేట్ నియోజకవర్గంలో గ్రాడ్యుయేట్ల ఓటరు నమోదు ప్రక్రియ బుధవారంతో ముగియనున్నదని పేర్కొన్నారు. ఇప్పటి వరకు గ్రాడ్యుయేట్ల ఓటరు నమోదు చాలా తక్కువగా నమోదైనందున గడువు పొడిగించాలని ఆయన కోరారు.

## కలెక్టర్‌కు మంచినీళ్లూ ఇవ్వలే

- కనీస మర్యాదకు నోచుకోలే..
- తహసీల్దార్‌పై కలెక్టర్ ఆగ్రహం

గట్టు, నవంబర్ 5: భారత్‌మాల రహదారి నిర్మాణ పనులను పరిశీలించడానికి జోగుళాంబ గద్వాల కలెక్టర్ బీఎం సంతోష్ మంగళవారం గట్టు మండలంలో పర్యటించారు. తప్పెట్లమొర్సు, ఆరగిద్ద ప్రాంతాల్లో రోడ్డు పనులను పరిశీలించిన అనంతరం ఎస్పీ శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ తో కలిసి కలెక్టర్ రాయాపురం భారత్‌మాల క్యాంపు-1 వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి నేరుగా తహసీల్దార్ ఆఫీసుకు వెళ్లి కొద్దిసేపు గడిపారు. కార్యాలయానికి వచ్చిన అధికారులకు రెవెన్యూ సిబ్బంది ఎలాంటి మర్యాద చేయకపోవడంతో తహసీల్దార్ సరితారాణిపై కలెక్టర్ ఫైర్ అయినట్టు సమాచారం. మంచినీళ్లు కూడా అందుబాటులో ఉంచకపోవడం ఆయనకు చిర్రెత్తుకొచ్చింది. వెంటనే కలెక్టర్ ఎస్పీ, అదనపు కలెక్టర్‌తో కలిసి కార్యాలయం నుంచి వెళ్లిపోయినట్టు తెలిసింది. మరోసారి తప్పిదం జరగకుండా చూస్తామని తహసీల్దార్ చెప్పినప్పటికీ కలెక్టర్ స్పందించలేదని సమాచారం. కలెక్టర్ వెళ్లిన తర్వాత రెవెన్యూ సిబ్బందిపై తహసీల్దార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారట.

## లైన్లు వేయలేం.. కరెంట్ ఇవ్వలేం

**ఇరిగేషన్ శాఖకు ట్రాన్స్‌కో అధికారుల అల్టిమేటం**

హైదరాబాద్, నవంబర్ 5 (నమస్తే తెలంగాణ): లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల డెవలప్‌మెంట్ చార్జీల బకాయిలను వెంటనే చెల్లించాలని, లేకుంటే కొత్త సబ్‌స్టేషన్లను, కొత్త లైన్లను ఏర్పాటు చేయలేమని, కరెంట్ సరఫరా చేయలేమని ట్రాన్స్‌కో అధికారులు నీటిపారుదల శాఖకు స్పష్టం చేశారు. ట్రాన్స్‌కో అధికారులు మంగళవారం విద్యుత్తుసౌధలో ఇరిగేషన్ అధికారులతో భేటీ అయ్యారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు రూ.2 వేల కోట్లు, కాళేశ్వరం ప్రాజెక్టు రూ.2,700 కోట్లు, సీతారామ ఎత్తిపోతలకు రూ.120 కోట్లు కలిపి మొత్తం రూ.6 వేల కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. వాటితోపాటు రూ.14,957 కోట్ల కరెంట్ బిల్లులను కూడా చెల్లించాలని ట్రాన్స్‌కో అధికారులు కోరినట్టు సమాచారం.

- ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం రాస్తారోకో

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తిలోని పాలమూరు చౌరస్తాలో ఏబీవీపీ, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విద్యార్థులు మానవహారం నిర్మించి రాస్తారోకో చేపట్టారు. లేకుంటే చదువుకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు. – కల్వకుర్తి

- కామారెడ్డిలో ఉపాధ్యాయుల నిరసన

పెండింగ్ బకాయిలతోపాటు నాలుగు డీఏలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో ఉపాధ్యాయులు మంగళవారం ధర్నాకు దిగారు. కామారెడ్డిలో తపాస్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. – కామారెడ్డి

## ఏపీలో అర్చకుల కనీస వేతనం 15 వేలు

హైదరాబాద్, నవంబర్ 5 (నమస్తే తెలంగాణ) : ఆంధ్రప్రదేశ్‌లో దేవాలయాల్లో పనిచేసే అర్చకుల కనీస వేతనాలు పెంచుతున్నట్టు దేవాదాయశాఖ మంత్రి రామనారాయణరెడ్డి తెలిపారు. దీంతో 3,208 మంది అర్చకులకు లబ్ధిచేకూరనున్నది.

## రెండు రాష్ట్రాల్లో టీటీడీ 'మనగుడి'

హైదరాబాద్, నవంబర్ 5 (నమస్తే తెలంగాణ): కార్తీక మాసం సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో రెండు తెలుగురాష్ట్రాల్లో 11 నుంచి 17 వరకు 'మనగుడి' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు టీటీడీ అధికారులు వెల్లడించారు. ఏపీ, తెలంగాణలో జిల్లాకు ఒకటి చొప్పున ఎంపిక చేసిన శివాలయాల్లో ఏడు రోజులపాటు క